సాక్షి నిజామాబాద్

శనివారం । 9 । నవంబర్ । 2024



సిలబస్ పూర్తి చేయాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సిలబస్‌ను త్వరగా పూర్తి చేయాలని డీఐఈవో ప్రిన్సిపాళ్లను ఆదేశించారు.

- 8లో ▸



ఇబ్బందులు లేకుండా చూడాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.5 /14.5

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి కుటుంబ వివరాల సేకరణ

నిజామాబాద్‌అర్బన్: సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో భాగంగా శనివారం నుంచి రెమ్యునరేటర్లు ఇంటింటికి తిరుగుతూ కుటుంబ వివరాలను సేకరించనున్నారు. ఈ నెల 6 న చేపట్టిన హౌస్ లిస్టింగ్ పనిని పూర్తి చేశారు. ఇక ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ వ్యక్తిగత, ఆర్థిక, సామాజిక వివరాలను నమోదు చేసుకోనున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలు లేకుండా పగడ్బందీగా సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఇదివరకే అధికారులను ఆదేశించారు. సిబ్బందికి శిక్షణ పూర్తయ్యింది.

లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



నవీపేట : వివిధ గ్రామాలలో సహకార, ఐకేపీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరగాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనమంతు సూచించారు. నవీపేట మండలం అభంగపట్నం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ జిలాలో ఏర్పాటు చేసిన 670 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 65 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేరించినట్లు తెలిపారు. 48 గంటల్లో బిల్లులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గన్నీ బస్తాలు, లారీల కొరత లేకుండా చూస్తున్నామన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీవో పాయాగౌడ్, డీసీవో శ్రీనివాస్‌రావు, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లై డీఎం రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి మామిడిపల్లి రోడ్డు మూసివేత

ఖలీల్‌వాడి: అడవి మామిడిపల్లి వద్ద రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు నడుస్తున్నందున ఈ నెల 10 నుంచి డిసెంబర్ 10 వరకు రహదారి మూసి వేస్తున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్ మధ్య వాహనాల రాకపోకల దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు.

- నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వెళ్లే భారీ వాహనాలు డిచ్‌పల్లి ఎన్‌హెచ్ –44 పైనుంచి వెళ్లాలి. ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు భారీ వాహనాలు ఇదే రూట్‌లో రావాలి.
- ఆర్టీసీ బస్సులు చిన్నాపూర్, కల్లెడి, ఆలూర్ గ్రామాల మీదుగా ఆర్మూర్‌కు వెళ్లాలి. ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వచ్చే ఆర్టీసీ బస్సులు ఇదే రూట్‌లో రావాలి.

17 మందికి డీఎస్సీ ఉద్యోగాలు

నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో డీఎస్సీ ద్వారా మరో 17 మందికి శుక్రవారం రాత్రి పోస్టింగులు ఇచ్చారు. గతంలో ధ్రువ పత్రాలు సక్రమంగా లేవని కొందరికి అధికారులు పోస్టింగ్ నిలిపివేశారు. ప్రస్తుతం రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారి ధ్రువపత్రాలను పరిశీలించి ఉద్యోగాలు ఇచ్చారు.

ట్రాఫిక్ జామ్

మాధవ నగర్ రైల్వే గేటు సమీపంలో శుక్రవారం సాయంత్రం 6:30 గం.ల ప్రాంతంలో వాహనాల గజిబిజీ



- మాధవ నగర్ రైల్వే గేట్ వద్ద గంటల తరబడి నిలిచిపోయిన వాహనాలు
- తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు




మాధవ నగర్ రైల్వే గేటు వద్ద శుక్రవారం మధ్యాహ్నం వాహనాల రద్దీ



నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ నగర శివారులోని మాధవ నగర్ రైల్వేగేటు వద్ద శుక్రవారం సాయంత్రం 5.30 గంటల నుంచి సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. రైల్వే గేటు నుంచి ఇరువైపులా, బై పాస్ రోడ్డు లోనూ సుమారు కిలో మీటరు దూరం వరకు వాహనాలు నిలిచి పోయాయి. వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మధ్యా హ్నం సైతం ట్రాఫిక్ సమ స్య ఏర్పడి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. మూడు రోజులుగా రైల్వే గేట్లు మొరాయిస్తుండటంతో రైల్వే సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా వాహనాలు ఆగిపోతున్నాయి. మధ్యలో ఇరుక్కుపోయిన వాహనదారులు ఎటూ వెళ్లలేక పోతున్నారు. భారీ లోడ్‌లతో లారీలు ఈ దారి గుండానే వెళ్తుండటంతో ట్రాఫిక్ మరింత జటిలమవుతోంది. అదే విధంగా కొందరు వాహనదారులు రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ సమస్యను ఏ మాత్రం పట్టించుకోకుండా రాంగ్ రూట్‌లో వెళ్తుండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలకు దారి లేకుండా పో తోంది. దీంతో ట్రాఫిక్ స్తంభించి పోతోంది. ప్రతి నిత్యం రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, ఈ మార్గం గుండా భారీ వాహనాలను నిషేధించి, ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

విమానం ఎగిరేనా!



వరంగల్ సమీపంలోని మామునూరు వద్ద అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయ నిర్మాణానికి ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని జక్రాన్ పల్లి ఎయిర్‌పోర్టు అంశం చర్చకు వస్తోంది. ఇక్కడ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గతంలోనే ఏఏఐ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విమానాశ్రయం ఏర్పాటు అయితే జిల్లాలో అధికంగా సాగు అయ్యే వరి, మొక్కజొన్న, సోయా, పసుపు పంటలు ఎగుమతులు చేసే వీలుంటుంది. తద్వారా రైతులకు మరింత మేలు జరుగుతుంది. ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయి.

- 'మామునూరు విమానాశ్రయం' అంశంతో జక్రాన్‌పల్లి విమానాశ్రయంపై ఆశలు
- ఇప్పటికే 1,663 ఎకరాల్లో సర్వే చేసిన రాష్ట్ర పభుత్వం
- 'టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ నివేదిక' ఇచ్చిన ఏఏఐ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉత్తర తెలంగాణలో కీలకమైన, వ్యవసాయరంగంలో ముందున్న, పసుపు పంటను అత్యధికంగా పండించే నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లి మండలంలో విమానాశ్రయం ఏర్పాటు కోసం డిమాండ్లు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వరంగల్ సమీపంలోని మామునూరు వద్ద బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయ వ్యవహారం రన్‌వే మీదకు వచ్చిన నేపథ్యంలో జక్రాన్‌పల్లి ఎయిర్ పోర్టు అంశం సైతం మరోసారి చర్చకు వచ్చింది. వచ్చే రెండేళ్ల కాలంలో మామునూరులో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో నిర్మించి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇందుకు సంబంధించి అదనంగా అవసరమైన భూమిని కేటాయించనున్నారు. దీంతో జక్రాన్‌పల్లి గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని సైతం నిర్మాణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యచరణ మొదలుపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గెజిట్ సైతం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఇక్కడ విమానాశ్రయం అత్యంత ఆవశ్యకమని రైతులు, వ్యాపారులు, ప్రజలు అంటున్నారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే జాతీయ, అంతర్జాతీయ ట్రేడర్లు, వ్యాపారులు, సైంటిస్టులు, డెలిగేట్లు, ఉన్నతాధికారులు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విమా నాశ్రయం అవసరమని, మరోవైపు నేరుగా పసుపు ఎగుమ తులు చేసేందుకు వీలుగా కార్గో విమానాలు సైతం న డిపేందుకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే డిమాండ్లు వస్తున్నాయి.

జిల్లాలోని జక్రాన్‌పల్లి వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గతంలోనే ఏఏఐ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అదేవిధంగా 'టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ' నివేదికను 2021లోనే ఏఏఐ రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. తెలంగాణ విశ్వవిద్యాలయం శంకుస్థాపనకు వచ్చిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుకు హామీ ఇచ్చారు. మండలంలోని తొర్లికొండ, కొలిప్యాక్, అర్గుల్, జక్రాన్‌పల్లి, మనోహరాబాద్ గ్రామాల పరిధిలోని 1,663 ఎకరాల్లో విమానాశ్రయం నిర్మించాల్సి ఉంటుందని ఏఏఐ పేర్కొంది. ఇందుకు సంబంధించి భూముల కోసం రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల కిందటే భూ సర్వే నిర్వహించింది. మరో 68 ఎకరాల భూమి అవసరమని నిర్ణయించారు.

ఎకానమీ పెరుగుతుంది..



జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తే వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా ఎగుమతులు చేసేందుకు వీలుగా ఉంటుంది. రాష్ట్రంలో అత్యధికంగా నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లోనే పసుపు ఎక్కువగా పండిస్తున్నారు. వరి, మొక్కజొన్న, సోయా తదితర పంటలు సైతం ఈ ప్రాంతంలో ఎక్కువగా పండుతున్నాయి. ఈ పంట ఉత్పత్తులకు అదనపు విలువ జోడించి ఎగుమతులు చేసే యూనిట్లు ఏర్పాటు కావాలి. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచొచ్చు. వీటన్నింటికీ మార్గం సుగమం కావాలంటే జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం నిర్మించాల్సిన ఆవశ్యకత ఉంది. దీంతో ఈ ప్రాంతంలో ఎకానమీ పెరుగుతుంది.

– నల్ల దినేష్‌రెడ్డి, నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

అందుబాటులో న్యాయసేవలు



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



ఖలీల్‌వాడి: ఆదివాసులు, దళితులు, మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన అందరికి న్యాయసేవలు అందుబాటులో ఉన్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల తెలిపారు. న్యాయసేవల దినోత్సవం సందర్భంగా జిల్లాకోర్టు ప్రాంగణం నుంచి నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆర్థిక అసమానతల కారణంగా ఎవరు కూడా న్యాయసేవలకు దూరం కాకూడదనే న్యాయసేవల చట్టం రూపొందించారని చెప్పారు. కేసుల రాజీ చేయడానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. పేదలు, మహిళలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, సూపరింటెండెంట్ శైలజారెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, న్యాయవాదులు ఆశా నారాయణ, రణదీశ్, గోపాల్ రెడ్డి, పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వర్ని ఎస్సై



బాధితుడు నాగరాజు



లంచం డబ్బులతో వర్ని ఎస్సై కృష్ణకుమార్

వర్ని: స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా వర్ని ఎస్సై కృష్ణ కుమార్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వర్ని మండలంలోని కోటయ్య క్యాంపు గ్రామానికి చెందిన నాగరాజుపై నాలుగు రోజుల క్రితం మండల కేంద్రంలో జరిగిన ఓ గొడవలో కేసు నమోదు అయ్యింది. ఆ కేసులో స్టేషన్ బెయిల్ ఇవ్వటానికి ఎస్సై కృష్ణ కుమార్ రూ.లక్ష డిమాండ్ చేశాడు. ఆఖరుకు రూ. 20 వేలకు ఒప్పుకున్నాడు. లంచం తీసుకుంటుండటంతో పాటు ఫోన్లో తనను బూతులు తిట్టాడని మనస్తాపం చెందిన నాగరాజు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో బాధితుడి నుండి ఎస్సై డబ్బులు తీసుకుంటుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. రూ. 20 వేల నగదును సీజ్ చేసి ఎస్సైపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఏసీబీ సీఐ వేణు కుమార్, శ్రీనివాస్, నగేష్ ఈ దాడిలో పాల్గొన్నారు.

రైతులకు తెలుగులో విద్యుత్ వివరాలు

- ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రవీందర్



సుభాష్‌నగర్: రైతులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఎస్టిమేట్‌కు సంబంధించిన మెటీరియల్స్ వివరాలు, స్కెచ్ (నక్ష) ఇక నుంచి తెలుగులో అందిస్తున్నామని టీజీ ఎన్‌పీడీసీఎల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వివరాలు, రైతులకు వచ్చే ఎస్ఎంఎస్‌లో లింకు క్లిక్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చని, తద్వారా రైతులకు అందించే మెటీరియల్ జాబితాపై వారికి పూర్తి స్పష్టత ఉంటుందన్నారు. ఎస్ఎంఎస్ కూడా తెలుగులోనే పంపిస్తామన్నారు. రైతులు తమ పని గురించి ఎలాంటి సామగ్రి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని ఎస్ఈ స్పష్టం చేశారు. ఏజెన్సీ వారు వచ్చి పని పూర్తి చేస్తారన్నారు. 'విద్యుత్ అధికారుల పొలం బాట' కార్యక్రమంలో

అధికారులు వ్యవసాయ క్షేత్రాలు సందర్శించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. వంగిపోయిన స్తంభాలు, లూజ్ లైన్లను సరిదిద్దుతున్నామన్నారు. కెపాసిటర్లు అమర్చడం ద్వారా మోటార్లు మరింత కాలం మన్నికగా ఉండేందుకు దోహద పడుతాయని,

లో వోల్టేజ్ సమస్య ఉండదని రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆటోస్టార్టర్లు తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. 'జీరో విద్యుత్ ప్రమాదాల కార్యక్రమం' చేపడుతున్నామన్నారు. ఇందులో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచుతున్నామని తెలిపారు. ఎర్తింగ్ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, హార్వెస్టర్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశమున్న నేపథ్యంలో తక్కువ ఎత్తులో ఉన్న వాటి స్థానాల్లో 9.1 మీటర్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి సంస్థ కట్టుబడి ఉందని, ఇబ్బందులు తలెత్తితే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఈ రవీందర్ సూచించారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ఆర్‌పీలు డుమ్మా

- బల్దియా కమిషనర్ ఆదేశాలు బేఖాతరు
- పెండింగ్ డబ్బులివ్వాలని డిమాండ్
- 29 మందికి మెమోల జారీకి ఆదేశం



నిజామాబాద్ సిటీ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర ఇంటింటి సర్వేకు కొందరు రిసోర్సు పర్సన్ (ఆర్‌పీ)లు డుమ్మా కొట్టారు. ఈనెల 6 నుంచి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. ముందుగా ఇంటింటికి సర్వేపై అవగాహన కల్పించి స్టిక్కరింగ్ చేస్తున్నారు. ఈ సర్వేలో ఎన్యుమరేటర్లుగా ప్రభుత్వ ఉద్యోగులు, విభాగాలు, మెప్మా ,అంగన్‌వాడీ సిబ్బంది, ప్రభుత్వ ఎస్‌జీటీలు, ప్రైవేట్ ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. అయితే గత రెండు రోజులుగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 29 మంది రిసోర్సుపర్సన్‌లు విధులకు గైర్హాజరు అయ్యారు. ప్రతిరోజు సర్వే రిపోర్టును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ 29 మంది గైర్హాజరును పసిగట్టారు. కొందరు ఆర్‌పీలు సర్వే చేయడానికి సిద్ధపడటం లేదని, సర్వే విధులు నిర్వహించలేమని ఖరాఖండిగా చెబుతున్నారని పీఆర్‌పీ శోభారాణి కమిషనర్‌కు వివరించారు. దీంతో సర్వేకు రాని 29 మంది ఆర్‌పీలకు మెమోలు జారీచేయాలని మెప్మా పీడీ రాజేందర్‌కు బల్దియా కమిషనర్ దిలీప్‌కుమార్ సూచించారు. కాగా తనకు ఇప్పటివరకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందలేదని మెప్మా పీడీ రాజేందర్ 'సాక్షి' కి తెలిపారు. జిల్లాలో మొత్తం 205 మంది ఆర్‌పీలు ఉన్నారని, వారిలో కేవలం 29 మంది మాత్రమే సర్వేకు దూరంగా ఉన్నట్లు తనకు తెలిసిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే ప్రక్రియకు ముందే ఆర్‌పీలు తమకు సర్వే చేసినందుకుగాను హానరోరియం (గౌరవవేతనం) అందరితోపాటు సమానంగా ఇవ్వాలని కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కోరారు. అయితే అందరికి సమానంగా సర్వే చేసిందుకు గౌరవ వేతనం అందుతుందని, ఇందులో ఎలాంటి అనుమానాలు పెట్టుకోకుండా సర్వేలో పాల్గొనాలని ఆయన ఇదివరకే స్పష్టం చేశారు.

డుమ్మాకొట్టిన ఆర్‌పీలతో డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్, అడిషనల్ కమిషనర్ శంకర్, పీఆర్‌పీ శోభారాణి మాట్లాడినా వారు సర్వే చేయమని ఖరాఖండిగా చెప్పినట్లు తెలిసింది. అయితే నిజామాబాద్ నగరంలో నాందేవ్‌వాడ, హమాల్‌వాడీ, వినాయక్‌నగర్ తదితర ఏరియాల్లోని ఇద్దరు సీవోల పరిధిలో ఉన్న ఆర్‌పీలు మాత్రమే సర్వేకు మొండికేస్తున్నారు. సర్వేకు ముందునుంచి ఆర్‌పీలు విముఖంగానే ఉన్నారు. కమిషనర్ డ్యూటీలు వేసినప్పుడు కూడా తమకు లిఖితపూర్వకంగా ఆర్డర్ ఇవ్వాలని పట్టుపట్టారు. కమిషనర్ దిలీప్‌కుమార్ వీరికి లిఖితపూర్వకంగా ఆర్డర్‌లను వ్యక్తిగతంగా ఇచ్చారు. తీరా ఆర్డర్ తీసుకుని, సర్వే ప్రారంభమైన తర్వాత కొందరు మాత్రమే కమిషనర్ ఆదేశాలు ధిక్కరిస్తున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆర్‌పీలకు వేతనాలు గత 6 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని వెంటనే ఇప్పించాలి. మాకు గౌరవ వేతనం ప్రకటించాలి. గతంలో చేసిన సర్వే డబ్బులు ఇంత వరకు ఇవ్వలేదు. మెప్మా ఆర్‌పీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. అధికారుల వేధింపులు ఆపాలి. – స్వర్ణలత, ఆర్‌పీ

ఆర్‌పీలకు ముందుగానే అవగాహన కల్పించాం

ప్రభుత్వం ఇచ్చిన పనులు చేయడమే ఆర్‌పీల పని. సర్వేలు చేస్తే ప్రభుత్వం నుంచి గౌరవవేతనం కూడా వస్తుంది. గతంలో కూడా ఆర్‌పీలకు హానరోరియం ఇచ్చాం. ఈ సర్వేపై కూడా ముందుగానే అవగాహన కల్పించాం. కొందరు మాత్రమే సర్వే చేయడానికి ఒప్పుకోవడం లేదు. కమిషనర్ దిలీప్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చాం. – శోభారాణి, పీఆర్‌పీ

నిబంధనలు పాటించాల్సిందే

సర్వేకు కొందరు ఆర్‌పీలు డుమ్మా కొడుతున్న విషయం నా దృష్టికి వచ్చింది. వారు కోరినవిధంగానే ఆర్డర్‌లు కూడా ఇచ్చాం. అందరితోపాటు సర్వే డబ్బులు కూడా ఇస్తామని చెప్పాం. ముందు అంతా ఒప్పుకున్నారు. కొందరు మాత్రమే చెప్పిన మాట వినడం లేదు. ప్రభుత్వ నిబంధనలు పాటించనివారిపై చర్యలు తప్పవు. – రాజేంద్ర కుమార్, డిప్యూటీ కమిషనర్

క్లుప్తంగా

లింబాద్రి గుట్టపై ఉత్సవాలకు అంకురార్పణ



మోర్తాడ్‌: భీమ్‌గల్‌ మండలంలోని లింబాద్రి గుట్టపై ఉత్సవాలకు శుక్రవారం పురోహితులు అంకురార్పణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా మృత్యంగ్రహణం, దీపారాధన, రక్షబంధనం, గరుడపటాధివాసం, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. అంకురార్పణ కార్యక్రమాన్ని ఆగమశాస్త్రం ప్రకారం పుట్టమట్టిని సేకరించి 18 పాత్రల్లో పోసి విత్తులు వేశారు. ఉత్సవాలు ఆరంభమైన నాటి నుంచి ముగింపు వరకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకూడదనే భావనతో అంకురార్పణ కార్యక్రమాన్ని వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆలయ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలి

- బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



బోధన్‌రూరల్‌: పట్టణంలోని శ్రీచక్రేశ్వర ఆలయ అభివృద్ధికి పాలకవర్గం చేయాలని బోధన్‌ ఎమ్మెల్యే, మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆలయంలో శుక్రవారం నిర్వహించిన ఆలయ నూతన అభివృద్ధి కమిటీ ప్రతినిధుల ప్రమాణా స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సుంకోజు హరికాంత్‌ చారి, సింగం లక్ష్మణ్‌, కమల రమేష్‌, మదరోల్ల కవిత, సూర లింగం, నాగేశ్‌ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్‌ ఏఎంసీ చైర్మన్‌ అంకు సంధ్య, మాజీ ఎంపీపీ, టీపీసీసీ డెలిగెట్‌ గంగారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

క్యాంపస్‌ బాలుర వసతి గృహాల తనిఖీ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బాలుర వసతి గృహాలను చీఫ్‌వార్డెన్‌ మహేందర్‌ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. తెయూ వీసీ టి యాదగిరిరావు ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. హాస్టళ్లలో భోజనానికి ఉపయోగించే నిత్యావసర వస్తువులను పరిశీలించారు. రెండు వసతి గృహాల్లోని విద్యార్థులు, మెస్‌ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వసతి గృహాల సిబ్బంది హాస్టళ్లతో పాటు మెస్‌ హాల్స్‌ను శుభ్రంగా ఉంచాలని,విద్యార్థులకు రుచికరమైన, నాణ్య మైన భోజనం అందించాలని ఆదేశించారు. వసతి గృహాల వార్డెన్లు కిరణ్‌రాథోడ్‌, గంగాకిషన్‌, కేర్‌ టేకర్స్‌, మెస్‌ కమిటీ సభ్యులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెయూ డిగ్రీ పరీక్షల షెడ్యూల్‌ విడుదల

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షల షెడ్యూల్‌ విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీబీసీఎస్‌ సిలబస్‌ ప్రకారం బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ 1, 3, 5వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, 2, 4, 6వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ (2020 నుంచి 2023 బ్యాచ్‌ విద్యార్థులకు మాత్రమే) ఈ షెడ్యూల్‌ వర్తిస్తుందన్నారు. ఈ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కంట్రోలర్‌ సూచించారు.

వేంపల్లి పాఠశాలకు సార్లొచ్చారు..!

- నలుగురి ఉపాధ్యాయుల కేటాయింపుతో తీరిన సమస్య
- గ్రామం నుంచి మరో ఆరుగురు వీవీలు
- విజయవంతంగా సాగుతున్న పాఠశాల



ప్రార్థనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



రేకుల షెడ్డుతో ఉన్న పాఠశాల భవనం

బాల్కొండ: ముప్కాల్‌ మండలం వేంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులను ప్రభుత్వం కేటాయించింది. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీరింది. గత పదేళ్ల క్రితం గ్రామస్తులు తమ పిల్లలను ప్రయివేటు పాఠశాలలకు పంపమని తీర్మానం చేశారు. నాటి నుంచి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కళకళ లాడుతోంది. ప్రస్తుతం పాఠశాలలో ప్రీ ప్రైమరీ పాఠశాలలో 80 మంది, ప్రైమరీ పాఠశాలలో 167 మంది విద్యార్థులు మొత్తం 247 మంది విద్యార్థులు చదుతున్నారు. డీఎస్సీకి ముందు పాఠశాలలో ఇద్దరు రెగ్యులర్‌ ఉపాధ్యాయులు, ఇద్దరు డిప్యుటేషన్‌పై ఉన్నారు. కానీ డీఎస్సీలో ఉపాధ్యాయుల నియామకంతో ప్రభుత్వం ఈ పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులను కేటాయించింది. దీంతో ఉపాధ్యాయుల సంఖ్య 8కి చేరింది. కానీ డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఇద్దరిని రిలీవ్‌ చేసింది. ప్రస్తుతం ఆరుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలో పని చేస్తున్నారు.

ఆరుగురు వీవీలు..

గత పదేళ్ల నుంచి ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీ(ఎల్‌కేజీ, యూకేజీ)లను నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులే కాకుండా గ్రామస్తులు వేతనాలు చెల్లించుకుంటు ఆరుగురు విద్యావలంటీర్లను నియమించుకున్నారు. పాఠశాలలో ప్రస్తుతం ఆరుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ఆరుగురు విద్యావలంటీర్లతో కలిపి 12 మంది విద్యా బోధన చేస్తున్నారు. పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఒక సెక్షన్‌ ఏర్పాటు చేసి పాఠాలు బోధిస్తున్నారు.

తరగతి గదుల కొరత

కొత్త డీఎస్సీతో కొంత మేర ఉపాధ్యాయుల కొరత తీరింది. కానీ పాఠశాలలో తరగతి గదుల కొరత మాత్రం వేధిస్తూనే ఉంది. గ్రామస్తులు స్వయంగా డబ్బులు పోగు చేసుకుని గదులకు మరమ్మతులు చేపట్టినా రేకుల షెడ్డుతో నిర్మించిన భవనం కావడంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. తరగతి గదుల కొరత ఉండటంతో వరండాలో, చెట్ల కింద చదువులు కొనసాగుతున్నాయి. సెక్షన్లు ఉండటంతో ఎక్కువ గదులు అవసరమవుతోంది. ప్రభుత్వం స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తే గ్రామంలో మూడు ఎకరాల భూమిని పాఠశాల కోసం ఇవ్వడానికి గ్రామస్తులు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయి వసతులతో నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భూమివ్వడానికి సిద్ధంగా ఉన్నాం



ప్రభుత్వం స్పందించి అన్ని వసతులతో నూతన పాఠశాల భవనం నిర్మిస్తే గ్రామంలో మూడెకరల స్థలం ఇవ్వడానికి గ్రామస్తులం సిద్ధంగా ఉన్నాం. తరగతి గదులు లేక ఇబ్బందిగా ఉంది. పాలకులు స్పందించి పాఠశాలను గుర్తించాలి.

– రామకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మన్‌, వేంపల్లి

గ్రామస్తుల సహకారంతోనే..



గ్రామస్తుల సహకారంతోనే గత పదేళ్లుగా పాఠశాల విజయవంతంగా సాగుతోంది. నలుగురు ఉపాధ్యాయులను ప్రభుత్వం కేటాయించింది. ప్రీ ప్రైమరీ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తరగతి గదుల కొరత తీర్చాల్సిన అవసరం ఉంది.

– శైవ శ్రీనివాస్‌, హెచ్‌ఎం, వేంపల్లి

సిలబస్‌ త్వరగా పూర్తి చేయాలి

- డీఐఈవో రవికుమార్‌



మాట్లాడుతున్న ఇంటర్‌ విద్యాధికారి రవికుమార్‌

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో సిలబస్‌ను త్వరగా పూర్తి చేసి, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఐఈవో తిరుమలపుడి రవికుమార్‌ ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో శుక్రవారం జూనియర్‌ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయోగశాలల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి విద్యార్థి ప్రాక్టికల్‌ తరగతులలో పాల్గొనేలా చూడాలన్నారు. డిసెంబర్‌లోగా సిలబస్‌ పూర్తి చేసి, ప్రాక్టికల్‌ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని ఆదేశించారు. నిష్ణాతులైన అధ్యాపకులచే ఎంసెట్‌ విద్యాబోధన చేయించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పాము కలకలం



పిట్లం: మండలంలోని కంబాపూర్‌ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కట్ల పాము కలకలం సృష్టించింది. శుక్రవారం ఉదయం తరగతి గదిలో పాము కనిపించడంతో విద్యార్థులు కేకలు వేస్తూ బయటకు వచ్చారు. దీంతో అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది స్థానికుల సాయంతో పామును చంపేశారు. పాఠశాలకు ప్రహరీ లేక పోవడంతోనే విషపురుగులు పాఠశాలలోకి వస్తున్నాయని, సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలి

నిజామాబాద్‌ సిటీ: కాంగ్రెస్‌ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక మాజీ మంత్రులు కేటీఆర్‌, ప్రశాంత్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఆరోపణలు చేసేముందు ఆత్మవిమర్శ చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్పంచుల బిల్లుల ఆలస్యానికి గత ప్రభుత్వానిది బాధ్యత కాదా అని ప్రశ్నించారు. సర్పంచులకు పెండింగ్‌ బిల్లులు రెండేళ్ల నుంచి బీఆర్‌ఎస్‌ సర్కారు ఇవ్వలేదని గుర్తుచేశారు. సర్పంచుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. పాలనలో అనుభవం ఉండి మంత్రులుగా పనిచేసిన కేటీఆర్‌, ప్రశాంత్‌రెడ్డిలు అసత్యాలు మాట్లాడటం తగదని హితువు పలికారు.

కాంగ్రెస్‌ ముక్త్‌ భారత్‌ అనే నినాదంతో ప్రధాని మోడీ ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేసినా బీజేపీ స్థానాలు తగ్గి కాంగ్రెస్‌ స్థానాలు పెరిగాయన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజారెడ్డి, డీసీసీబీ చైర్మన్‌ రమేశ్‌ రెడ్డి, ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌ తారాచంద్‌, విపుల్‌గౌడ్‌, విక్కీయాదవ్‌, వేణురాజ్‌, ప్రీతం, మహిళా నాయకులు ఉష, చంద్రకళ, రేవతి, విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌టౌన్‌: డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానాను సెకండ్‌ క్లాస్‌ జ్యూడీషియల్‌ మెజిస్ట్రేట్‌ శేషతల్ప సాయి విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ శుక్రవారం తెలిపారు. పట్టణంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని జడ్జి ఎదుట హాజరు పర్చినట్లు తెలిపారు. విచారణలో నేరం రుజువు కావడంతో సదరు వ్యక్తిని జడ్జి రెండు రోజుల జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

బైక్‌ టైర్‌ పేలి ఒక్కరి మృతి



స్వామిగౌడ్‌ (ఫైల్‌)

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి శివారులోని జాతీయ రహదారిపై టైరు పేలడంతో బైక్‌ నడుపుతున్న వ్యక్తి మృతి చెందాడు. దోమకొండ మండలం ముత్యం పేటకు చెందిన కొడిప్యాక స్వామిగౌడ్‌ (44) భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్‌ కల్లుడిపోలో కార్మికునిగా పనిచేస్తాడు. శుక్రవారం ముత్యపేటకు వెళ్లేందుకు తిప్పాపూర్‌ గ్రామం నుంచి బైక్‌ పై వెళ్తుండగా అంతంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై బైక్‌ వెనుక టైర్‌ పేలింది. బైక్‌ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రేలింగ్‌ను ఢీకొంది. స్వామిగౌడ్‌ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాయికుమార్‌ వివరించారు.

బిర్యాని కోసం వెళ్లి యువకుడు..

నిజామాబాద్‌ రూరల్‌: బిర్యాని తిందామని బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్‌ శుక్రవారం పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఒకటో డివిజన్‌ ఖానాపూర్‌లోని వీరభద్రకాలనీకి చెందిన భీమేశ్‌(27) అనే యువకుడు గురువారం రాత్రి బిర్యాని తిందామని సారంగపూర్‌ నుంచి తన బైక్‌పై వెళ్తుండగా గుండారం సమీపంలోని పెట్రోల్‌ బంక్‌ సమీపంలో అతన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య



ప్రసాద్‌రావు(ఫైల్‌)

మోపాల్‌: అప్పుల బాధతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మోపాల్‌ మండలంలోని న్యాల్‌కల్‌లో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో చుక్క యాదగిరిగౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్‌ గ్రామానికి చెందిన కాలూరి ప్రసాద్‌రావు(42) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై అప్పుల పాలయ్యాడు. గురువారం గ్రామ శివారులోని తన వ్యవసాయ షెడ్‌లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే పని చేస్తున్న ట్రాక్టర్‌ డ్రైవర్‌ రాజు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అర్ధరాత్రి పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. భార్య రుచిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్‌ బియ్యంతో అధికారులు, పోలీసులు

వేల్పూర్‌: మండల కేంద్రంలోని వజ్ర రైస్‌ మిల్లులో భారీగా పీడీఎస్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు వేల్పూర్‌ ఎస్సై నాగ్‌నాథ్‌ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి అందిన సమాచారం మేరకు వజ్ర రైసుమిల్లుపై దాడిచేయగా అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్‌ బియ్యం పట్టుబడిందన్నారు. సివిల్‌ సప్లై అధికారులకు సమాచారం అందించగా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో బియ్యం లెక్కించారన్నారు. మూడు లారీల బియ్యం లెక్కింపు జరిగిందని, రైస్‌మిల్లు డబ్బాలలో నిల్వ ఉన్న బియ్యం మరో రెండు లారీల వరకు లభించే అవకాశం ఉందన్నారు. శనివారం మధ్యాహ్నం వరకు బియ్యం లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందని ఎస్సై తెలిపారు. బియ్యం పూర్తిగా లెక్కింపు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలతో కేసు నమోదు చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్‌

- ఇద్దరికి తీవ్రగాయాలు



నిజాంసాగర్‌: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్‌ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన నిజాంసాగర్‌ మండల కేంద్రంలోని మంజీరా నది వంతెనపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్‌ బేగరి రాజు, లింగాగౌడ్‌ బైక్‌పై పని నిమిత్తం పిట్లంకు వెళ్లి తిరిగి వస్తుండగా మంజీరా నది వంతెనపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో వీరికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబీకులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం వీరి కోలుకుంటున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు



రానాకాలన్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఎడపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులు, నిర్వాహకులను కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. ఎడపల్లి మండలంలోని ఠానాకాలన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు, అధికారులకు సూచించారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లో బిల్లులు చెల్లిస్తామని అన్నారు. ఇప్పటి వరకు రైతుల నుంచి 65 మెట్రిక్‌ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌ వెంట తహసీల్దార్‌ ధన్వాల్‌, మండల వ్యవసాయాధికారి సిద్ధ రామేశ్వర్‌, సింగిల్‌ విండో ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, రైతులు లక్ష్మారెడ్డి, కాపు నాగేశం, ఆకుల సురేశ్‌, రాజారెడ్డి, సూర రాజేందర్‌, విండో కార్యదర్శి రాజారాం, సిబ్బంది బాలరాజు శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను పరిశీలించిన అధికారులు



వేల్పూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ అంకిత్‌కుమార్‌

వేల్పూర్‌/ మోర్తాడ్‌: వేల్పూర్‌ మండల కేంద్రంలో జరుగుతున్న ఇంటింటి కుటుంబ సర్వేను అదనపు కలెక్టర్‌ అంకిత్‌కుమార్‌ శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని 4, 5 వార్డుల్లో ప్రతి ఇంటికి అతికిస్తున్న స్టిక్కర్లను, ఇంటి యజమానులను సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో బాలకిషన్‌, జీపీ కార్యదర్శి వినోద్‌, ఈజీఎస్‌ ఏపీవో అశోక్‌, సీసీ రవి, సిబ్బంది ఉన్నారు. భీమ్‌గల్‌ మండలం బడా భీమ్‌గల్‌, చెంగల్‌లో చేపడుతున్న సమగ్ర సర్వేను అదనపు కలెక్టర్‌ అంకిత్‌ పరిశీలించారు. ఎన్యుమరేటర్లను సర్వే అంశాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు చేయవద్దని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సంతోష్‌కుమార్‌, సూపర్‌వైజర్లు, కార్యదర్శులు ఉన్నారు.

సీఎంను కలిసిన నగేశ్‌రెడ్డి



సీఎంను సన్మానిస్తున్న నగేశ్‌రెడ్డి



సీఎంతో పీసీసీ చీఫ్‌, బోధన్‌ ఎమ్మెల్యే

నిజామాబాద్‌ సిటీ: సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని క్యాంపుకార్యాలయంలో సీఎం రేవంత్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీఎంకు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. సీఎంను కలిసిన వారిలో పీసీసీ చీఫ్‌ బొమ్మ మహేశ్‌కుమార్‌ గౌడ్‌, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్‌ టోర్నీ



విజేతలుగా నిలిచిన ఆర్మూర్‌ బాలుర జట్టు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పాత కలెక్టరేట్‌ మైదానంలో క్రీడల కార్యదర్శి నాగమణి ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్‌ అండర్‌-14 బాల బాలికల వాలీబాల్‌ టోర్నీ నిర్వహించారు. టోర్నీలో గెలుపొందిన విజేత జట్లను డీఈవో అశోక్‌ అభినందించారు. బాలుర విభాగంలో ఆర్మూర్‌ మొదటి స్థానం, కమ్మర్‌పల్లి ద్వితీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో ఆర్మూర్‌ మొదటిస్థానం, ధర్పల్లి ద్వితీయ స్థానం సాధించాయి. కార్యక్రమంలో పెటా సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి, డీసీఈబీ సెక్రటరీ సీతయ్య, పీడీలు అబ్బపూర్‌ రవి, పవన్‌కుమార్‌, ఇందిర, రాజేశ్వర్‌, శ్రీనివాస్‌, రమణ, సురేందర్‌, గంగామోహన్‌, కవిత, స్వామి, కిరణ్‌, అనిల్‌ పాల్గొన్నారు.

హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణకు యత్నం



లక్ష్మణ్‌ మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని దుబ్బ ప్రాంతంలో ఉన్న ఓ వైన్స్‌ దుకాణం ఎదుట ఒకరిని హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్లు మూడో టౌన్‌ ఎస్సై మహేశ్‌ తెలిపారు. ఎస్సై శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన లక్ష్మణ్‌(28) అనే యువకుడు దుబ్బ ప్రాంతంలోని కాలూర్‌ చౌరస్తాలో ఉన్న వైన్స్‌ దుకాణం ఎదుట పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా లక్ష్మణ్‌ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. పట్టణ సీఐ శ్రీనివాస్‌రాజు, ఎస్సై మహేశ్‌ డాగ్‌ స్క్వాడ్‌తో కలిసి హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. లక్ష్మణ్‌ తలపై ఉన్న గాయాల ఆధారంగా కొందరు అతన్ని తీవ్రంగా గాయపర్చి హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించినట్లు పోలీసులు గుర్తించారు. వైన్స్‌తో పాటు దుబ్బ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసును ఛేదించేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

పోక్సో కేసులో ముగ్గురి రిమాండ్‌

- ఇద్దరు ఉపాధ్యాయులు, ఓ మాజీ ప్రజాప్రతినిధి అరెస్టు!


భిక్కనూరు: పోక్సో కేసులో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఓ మాజీ ప్రజాప్రతినిధిని భిక్కనూరు పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. మండలంలోని ఓ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిపై ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఇటీవల భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు అందింది. విచారణ అధికారిగా ఎల్లారెడ్డి డీఎస్పీని ఉన్నతాధికారులు నియమించారు.

విచారణ అనంతరం నిందితుడితో పాటు ఘటన గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించలేదని సదరు పాఠశాల హెచ్‌ఎంను,అదే గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. ఎల్లారెడ్డి డీఎస్పీ విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికను అందజేశారు.

బైక్‌చోరీలో మరో నిందితుడికి..

పెద్దకొడప్‌గల్‌: బైక్‌లను చోరీ చేసి విక్రయించేందుకు మహారాష్ట్రకు తీసుకెళ్తున్న నిందితుడిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బిచ్కుంద సీఐ నరేశ్‌ శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొడప్‌గల్‌ మండలంలోని బేగంపూర్‌ తండాకు చెందిన చౌహాన్‌ సుభాష్‌ అనే వ్యక్తి జల్సాలకు అలవాటుపడి కొన్ని రోజులుగా పెద్దకొడప్‌గల్‌, పిట్లం, ఎల్లారెడ్డి పరిధిలో గల మూడు బైక్‌లను చోరీ చేశాడు. వీటిని అంజని గ్రామ శివారులో దాచి మహారాష్ట్రలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం అందడంతో నిందితుడిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మూడు బైక్‌లను స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టులో హాజరుపర్చి జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్‌, సిబ్బంది రవి, రమేశ్‌, సాయిశివ, శ్రీను పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న దొంగలు



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్ల ముందర వాహనాలు ఉంచితే చోరీలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటన జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌ కాలనీలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. కాలనీలో ఓ వ్యక్తి తాను అద్దెకు ఉండే ఇంటి ఎదుట రాత్రి బైక్‌ను పార్క్‌ చేసి పడుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి బైక్‌ టైర్‌, బ్యాటరీలను దుండగులు దొంగిలించారు. పక్కనే ఉన్న మరో బైక్‌ బ్యాటరీ కూడా చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

యువకుడి ఆచూకీ లభ్యం



సత్యసాయి

ఎడపల్లి: మండలంలోని జైతాపూర్‌కు చెందిన సత్య సాయి అనే యువకుడు ఈ నెల 2న అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. అతను చిత్తూరు జిల్లాలో ఉన్నట్లు గుర్తించారు. స్థానిక ఎస్సై వంశీకృష్ణ రెడ్డి చిత్తూరు పోలీసులతో మాట్లాడి యువకుడిని బంధువులకు అప్పగించేలా కృషి చేశారు. తమ కుమారుడి ఆచూకీ లభించేలా కృషి చేసిన సీపీతో పాటు ఎస్సై వంశీకృష్ణకు యువకుడి తండ్రి వెంకటేశ్వరావు కృతజ్ఞతలు తెలిపారు.